క్లుప్తంగా

సత్తయ్యకు సన్మానం



సత్తయ్యను సత్కరిస్తున్న నాయకులు

మాడ్గుల: రాష్ట్ర సహకార బ్యాంక్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన కొత్త కురుమ సత్తయ్యను మాడ్గుల మండలానికి చెందిన పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. హైదరాబాదులో జరిగిన ఓ కార్యక్రమంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, మాడ్గుల సింగిల్ విండో డైరెక్టర్ జగన్ గౌడ్.. సత్తయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఆమనగల్లు: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలో గురువారం.. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డా.పరీక్షిత్ నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మండలంలో గుర్తించిన 10,661 మందికి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఆమనగల్లు ఎంపీడీఓగా మాధురి



ఆమనగల్లు: ఆమనగల్లు నూతన ఎంపీడీఓగా కుసుమ మాధురి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఫారుక్ హుస్సేన్ రెండునెలల క్రితం పదవీ విరమణ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తలకొండపల్లి ఎంపీడీఓ శ్రీకాంత్ ఆమనగల్లు ఇన్‌చార్జి ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్‌గా పనిచేస్తున్న కుసుమ మాధురిని ప్రభుత్వం ఆమనగల్లు ఎంపీడీఓగా బదిలీ చేసింది. నూతన ఎంపీడీఓను... ఎంపీపీ అనిత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీలత, పీఆర్ ఏఈ కృష్ణయ్య, సిబ్బంది.. కుమార్, ప్రసన్నలత, రాకేశ్, నర్సింహ, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ




అబ్దుల్లాపూర్‌మెట్: పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేసిన రాఘవేందర్‌గౌడ్

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని ఇనాంగూడలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు దేశారం రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, బ్యాగులు, ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయురాలు సవిత, అంగన్‌వాడీ టీచర్ ప్రభావతి పాల్గొన్నారు.

జాపాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

మంచాల: విద్యతోనే మార్పు సాధ్యమని యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. బుధవారం మంచాల మండలంలోని జాపాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుతోనే ప్రతి ఒక్కరి జీవితంలో మార్పు వస్తుందన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులు, టీచర్లకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



స్పోర్ట్స్ డ్రెస్సు ధరించిన విద్యార్థులతో పరమేష్

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థులు క్రీడలను జీవితంలో భాగస్వామ్యం చేసుకోవాలని ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పరమేష్ తెలిపారు. బడిబాటలో భాగంగా బుధవారం ఆయన విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. అనంతరం విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు.

ఉపాధి లెక్క తేలుస్తాం

- మంచాలలో కొనసాగుతున్న ఉపాధి హామీ సామాజిక తనిఖీలు
- ఇప్పటికే 14 జీపీల్లో గ్రామ సభలు పూర్తి
- పనులు, ఖర్చుపై అధికారుల ఆరా
- 22న మండల స్థాయి బహిరంగ ప్రజావేదిక



చిత్తాపూర్‌లో ఉపాధి పనుల సామాజిక తనిఖీపై గ్రామసభ

మంచాల: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల సామాజిక తనిఖీలు మంచాల మండలంలో పది రోజులుగా నిర్విరామంగా కొనసాగుతున్నాయి. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు రూ.3,15,50,672 మేర ఖర్చు చేశారు. అందులో మెటీరియల్ ఖర్చు రూ.22,20,17, కూలీలకు సంబంధించి ఖర్చు రూ.2,93,30,655. ఆంబోత్ తండాలో 6 రకాల పనులు చేయగా, లోయపల్లిలో 37 రకాల పనులు చేశారు. ఇలా మండల వ్యాప్తంగా 446 పనులు చేపట్టారు. అందులో ప్రధానంగా ల్యాండ్ లెవలింగ్, ఫాంపండ్స్, సీసీ రోడ్ల నిర్మాణం, చెట్లు నాటడం వంటి పనులు ఎక్కువగా ఉన్నాయి. ప్రజా అవసరాల నిమిత్తం అనేక పనులను ఉపాధి హామీ పనుల్లో చేపడుతున్నారు.

గ్రామ సభలు నిర్వహించి..

పనుల నిర్వహణకు సంబంధించిన రికార్డులను డీఆర్‌పీలు, ఎంఆర్‌పీలకు సమర్పించారు. ఈనెల 13వ తేదీ నుంచి 21వ తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణపై సామాజిక తనిఖీలు చేస్తున్నారు. గ్రామంలో పూర్తి స్థాయిలో పనుల పరిశీలన చేసి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభలు కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 14 గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేసి గ్రామసభలు నిర్వహించారు. అయితే సభలు పూర్తి చేసిన గ్రామాల్లో ల్యాండ్ లెవలింగ్ పనులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో కొంతవరకు కనిపించకుండా పోయాయి. ల్యాండ్ లెవలింగ్ పనులు చేసిన అనంతరం రైతులు వాటిని దున్నివేశారని ఫీల్డ్ అసిస్టెంట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని గ్రామాల్లో పనిదినాలు పూర్తి అయిన వారు ఇతరుల జాబ్‌కార్డులపై పని చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో 22న మండల స్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదికలో వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

కూలీలకు పని కల్పించాం



మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిబంధనల మేరకే చేపట్టాం. ఎలాంటి అవినీతికి తావు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు కూలీలకు చేతినిండా పని కల్పించాం.

– వీరాంజనేయులు, ఏపీఓ, మంచాల

పారదర్శకంగా తనిఖీలు

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలు పారదర్శంగా చేస్తాం. ఎక్కడ, ఎలాంటి అవకతవకలు జరిగినా వెలుగులోకి తీసుకొని వస్తాం. తదనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

– వెంకన్న, ఎస్ఆర్‌పీ

ఇబ్రహీంపట్నం అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పలు పనులకు శంకుస్థాపన



ఇబ్రహీంపట్నం: కర్ణంగూడ - పోచారం రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం–నాగర్జునసాగర్ హైవే నుంచి కర్ణంగూడ, ఎలిమినేడు, పోచారం, మంగల్‌పల్లి వరకు నూతనంగా నిర్మించిన ఆర్అండ్‌బీ రహదారిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నగరానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నం రూపురేఖలను మార్చివేస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి పనితీరు అధ్వానంగా మారిందని, త్వరలో ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీటీసీ ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ నరేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాచారం మండలానికి మహర్దశ..

యాచారం: సీఎం రేవంత్‌రెడ్డి కృషితో యాచారం మండలానికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. యాచారం మండలంలోని మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల, కేస్లీతండాలో బుధవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... యాచారం మండలంలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన కంపెనీల ఏర్పాటుకు సర్కార్ సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. వాటిలో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్, నాయకులు వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అరవింద్ నాయక్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలోని 2, 13వ వార్డుకు చెందిన జయమ్మ, పద్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రూ.8 వేల ఆర్థికసాయం అందించడంతో పాటు క్వింటాల్ బియ్యం అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు బుచ్చయ్య, మల్లేశ్‌గౌడ్, యాదయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి..

తలకొండపల్లి: పదోతరగతి వరకు తమతో కలిసి చదువుకున్న స్నేహితుడికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలవడంతో అతడికి వారంతా అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన శ్రీనుకు ఇటీవల బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు అతడికి రూ.52,500 ఆర్థికసాయం అందజేశారు. మిత్రులు రవీందర్, అజీమ్, శ్రీశైలం, విష్ణు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించండి

- ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కూలీల ధర్నా

యాచారం: ఉపాధి పనులకు సంబంధించి రెండు నెలలుగా బిల్లులు చెల్లించలేదని.. పనులు చేసి పస్తులుండాల్సి వస్తుందని కూలీలు వాపోయారు. ఉపాధి బకాయిల జాప్యాన్ని నిరసిస్తూ బుధవారం యాచారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలు ధర్నా నిర్వహించారు. కూలీలు మాట్లాడుతూ... రూ.వేలాది బకాయిల పెండింగ్ వల్ల పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేకపోతున్నామని, వ్యవసాయ పనుల్లో పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తుందని అన్నారు. పనులు చేసిన వెంటనే పేస్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. సరైన సౌకర్యాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఉపాధి కూలీ రూ.600 చెల్లించడంతో పాటు ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డికి అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, నాయకులు.. ఇందిరమ్మ, జంగయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అనాజ్‌పూర్, సంఘీనగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ఫీడర్లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విద్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కనకదుర్గానగర్, అనాజ్‌పూర్, గండిచెరువు, లష్కర్‌గూడ, సుర్మాయిగూడ, అబ్దుల్లాపూర్, సాయినగర్, కవాడిపల్లి, బలిజగూడ గ్రామాలతో పాటు వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

రేపు ఆదిబట్ల మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు, కోఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరుకావాలని చైర్మన్ కోరారు.

కార్మిక బీమా చేయించుకోవాలి

- కోఆప్షన్ మాజీ సభ్యుడు జహంగీర్ ఖాన్

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన కార్మిక బీమాను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యుడు జహంగీర్ ఖాన్ పేర్కొన్నారు. బుధవారం ఆదిబట్లలోని సాహెబ్‌గూడలో ఆయన మాట్లాడుతూ.. కార్మిక బీమా చేసుకోవడానికి తెల్ల రేషన్‌కార్డు తప్పనిసరి అన్నారు. 18 సంవత్సరాల వయస్సు నుంచి 55 సంవత్సరాల్లోపు ఉన్న స్త్రీ, పురుషుడు అర్హులన్నారు. ఏడాదికి రూ.22 చొప్పున ఐదు సంవత్సరాలకు కేవలం రూ.110 చెల్లించాలని తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ జత చేసి బ్యాంకు చలానా జతచేసి కార్మిక శాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. పాలసీదారుడు సహజ మరణం పొందితే రూ.1.30 లక్షలు, అలాగే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6లక్షలు వస్తుందన్నారు. ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి వివాహ నజరానాగా రూ.30 వేలు, ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ.30వేల చొప్పున వచ్చే అవకాశం ఉందన్నారు. సంవత్సరం పాలసీ పొందిన తర్వాత లబ్ధిదారుడికి ప్రమాదం జరిగి 50 శాతం వికలాంగుడిగా ఉంటే రూ.2.50 లక్షలు, అదే 100 శాతం ఉంటే రూ.5 లక్షలు పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుడిసెవాసులకు న్యాయం చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ నేతల వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్ రావినారాయణరెడ్డి కాలనీ సమీపంలో గుడిసెలు వేసుకున్న పేదలకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మంగళవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. కుంట్లూర్ సర్వే నంబర్ 215–225లో ఉన్న సుమారు 100 ఎకరాల భూమి భూదాన్ బోర్డుకు చెందుతుందని.. సీపీఐ నేతల ఆధ్వర్యంలో వేల సంఖ్యలో పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. దాదాపు ఏడాదిన్నర నుంచి వారంతా అక్కడే నివాసముంటున్నారని స్పష్టం చేశారు. ఈ భూమి విషయమై కోర్టు ఇటీవల ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని.. ఈ నేపథ్యంలో గుడిసెలను ఖాళీ చేయాలని రెవెన్యూ, పోలీసు అధికారులు వారం రోజులుగా సీపీఐ నాయకులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ విషయమై స్పందించిన రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సీపీఐ నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడురవీంద్రచారి, కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి, నాయకులు జంగయ్య తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

- ఎంఈఓ సర్దార్‌నాయక్



పెద్దారెడ్డి చెరువు తండా ప్రాథమిక పాఠశాల గేటుకు వేసిఉన్న తాళాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కడ్తాల్: మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నోడల్ అధికారి జంగయ్యతో కలిసి మండల విద్యాశాఖ అధికారి సర్దార్‌నాయక్ తనిఖీలు చేపట్టారు. ముందుగా ముద్వీన్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి.. పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా, ఒక్కరే ప్రార్థనకు హాజరుకాగ మిగతా ముగ్గురు పాఠశాలకు 5 నిమిషాలు ఆలస్యంగా రావడంతో వారికి ఒక్కపూట సెలవు వేయించారు. అక్కడి నుండి చరికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాల, ముద్వీన్ తండా పాఠశాల, పల్లెచెలక తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం పెద్దారెడ్డిచెరువు తండా ప్రాథమిక పాఠశాల, నాగిరెడ్డిగూడ తండా ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆ రెండు పాఠశాలలకు తాళాలు వేసి ఉండటాన్ని చూసి సదరు కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేయాలని కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయుడిని ఆదేశించారు. తదనంతరం న్యామతాపూర్ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశా, మక్తమాధారం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యా యులు సమయపాలన పాటించాలన్నారు.

జోడోయాత్ర దేశానికే ఆదర్శం

ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ పుట్టిన వేడుకలను బుధవారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల పరిధిలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాణాసంచా కాల్చడం, కేక్ కట్ చేయడం, పండ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రపై ప్రశంసలు కురిపించారు. భావి భారత ప్రధానమంత్రి రాహుల్ గాంధీ అంటూ నినాదాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కడ్తాల్: వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



మంచాల: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో..



ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న వంశీచంద్‌రెడ్డి



తలకొండపల్లి: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆమనగల్లు: కేక్ కట్ చేస్తున్న హస్తం నేతలు

సీఆర్పీ ప్రసాద్‌కు నివాళి

మంచాల: మంచాల మండల సీఆర్పీ ప్రసాద్ (55) మరణం తీరని లోటని సహచర ఉద్యోగులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద సీఆర్పీ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంచాల మండలంలో గత ఇరవై ఏళ్లుగా విద్యాశాఖలో సీఆర్పీ ప్రసాద్ సేవలందించారని తెలిపారు. గుండెపోటుతో ఆయన మరణించడం తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారనిలో.. సీఆర్పీలు జగదీశ్, గిరీశ్, ఐఈఆర్‌పీఎస్ సత్యనారాయణ,యాదయ్య, సీసీఓ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.